# సాక్షి
## రాజన్న సిరిసిల్ల

మంగళవారం | 23 | ఏప్రిల్ | 2024






### భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను సోమవారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎండ ఎక్కువగా ఉండడంతో భక్తులు అంతంతే వచ్చారు.



### ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వేములవాడఅర్బన్: ఆరెపల్లిలోని హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.

గరిష్టం/కనిష్టం
39.0/27.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది.

## న్యూస్‌రీల్

### '108' సేవల్లో సిరిసిల్ల నంబర్ వన్



సిరిసిల్లటౌన్: ఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ద్వారా జిల్లాలో అందిస్తున్న 108, 102, 1962 అంబులెన్స్ సేవలకు రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా రాజన్నసిరిసిల్ల జిల్లా నిలిచింది. రాష్ట్రంలో 108 ఎమర్జెన్సీ, 102 అమ్మ ఒడి, 1962 సంచార పశువైద్యం అందించే అంబులెన్స్ సర్వీసెస్‌కు అరుదైన గౌరవం దక్కింది. సోమవారం జిల్లా 108 మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ అవార్డు అందుకున్నారు.

### గ్రీవెన్స్ డేతో సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సోమవారం 14 ఫిర్యాదులు అందాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి, న్యాయం చేయాలని సంబంధిత స్టేషన్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు.

### మేడే పోస్టర్ ఆవిష్కరణ



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటలో సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో 138వ మేడే పోస్టర్ ఆవిష్కరించారు. మండల కార్యదర్శి సోమ నాగరాజు, హమాలీ సంఘం నాయకులు గౌర అంజయ్య, గణాధి శంకర్, సోమ లక్ష్మీరాజం, మల్లయ్య, అంజయ్య, నారాయణ, కనకయ్య, ఎల్లయ్య, మహేశ్, దేవయ్య ఉన్నారు.

### టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు

సిరిసిల్లఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. ఫిబ్రవరిలో జరిగిన ఈ కోర్సు పరీక్షలు రాసిన అభ్యర్థులు మార్కుల జాబితాను www.bse.telangana.gov.in. వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. ఉత్తీర్ణత సర్టిఫికెట్లు డీఈవో ఆఫీస్‌లో పంపిణీ చేస్తామని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ సోమవారం తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులతో శాంతినగర్, రాళ్లబావి, విమల టాకీస్ ఏరియా, వేంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, గాంధీనగర్, సుభాష్‌నగర్, గీతానగర్, విద్యానగర్‌లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ మధుకర్ కోరారు.

# బీడీల ఆకు.. వేసవి 'ఉపాధి'



నెత్తిన ముల్లెలతో వస్తున్న ఈ మహిళలది కోనరావుపేట మండలం నిజామాబాద్. తెల్లవారు జామునే అడవుల్లోకి వెళ్లి.. తునికి చెట్లను గుర్తించి ఆ చెట్ల ఆకును సేకరించి ముల్లెలతో ఇంటికి వెళ్తున్నారు. ఉదయం 10 గంటలకల్లా ఇంటికి చేరి పొద్దంతా ఆ ఆకును కట్టలుగా కట్టి ఆరబెడతారు. ఎండిన తునికాకు కట్టలను అమ్మితే మహిళలకు ఉపాధి లభిస్తుంది. స్థానికంగా బీడీలు చేసే మహిళలు బీడీల ఆకును కొంటారు. ఉపాధిపై ఆశలో ఈ సీజన్‌లో తునికాకు సేకరిస్తున్నారు.



ఇది రుద్రంగి మండలం మానాల, కోనరావుపేట మండలం మరిమడ్ల శివారులోని సరిహద్దు అడవులు. మూడు మోటార్ సైకిళ్లపై తునికాకు ముల్లెలు, వెనకాల మహిళలతో వస్తున్న వీరిది మానాల శివారులోని గిరిజన తండాలు. ఈ తండాల గిరిజనులు నిత్యం అటవీప్రాంతానికి బండ్లపై వెళ్లి తునికాకు సేకరించి ఇలా ముల్లెలతో ఇంటికి వెళ్తున్నారు. ఈ తునికాకును ఇంటి వద్ద మదత పెట్టి, కట్టలు కట్టి, ఆరబెట్టి అమ్ముకుంటే.. మెరుగైన ఉపాధి లభిస్తుంది. బతుకుదెరువు ఆశతో తునికాను ఇలా సేకరిస్తున్నారు.

- బతుకుదెరువునిస్తున్న బీడీల ఆకు
- కల్లాలు లేకున్నా సేకరిస్తున్న పల్లెప్రజలు
- కొమ్మకొట్టకపోవడంతో అంతంతే ఆకు
- అడవిలో జాగ్రత్తగా ఉండాలి : ఎఫ్ఆర్వో



అటవీ ప్రాంతంలో తునికాకు తెంపుతున్న మహిళ

సిరిసిల్ల: అటవీ ప్రాంతాల్లోని పల్లెవాసులకు నమ్మకమైన ఉపాధినిచ్చే పని ఏదైనా ఉందీ అంటే అది తునికాకు సేకరణే. వేసవిలో పెద్దగా వ్యవసాయ పనులు, ఇతర పనులు లేని రోజుల్లో గ్యారంటీగా ఇంటిల్లిపాదికీ తునికాకు సేకరణ ఉపాధి కల్పిస్తుంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని అటవీశివారు గ్రామాల్లో తునికి చెట్లు ఉన్నాయి. తునికాకు సేకరణకు జిల్లాలో అటవీశాఖ కల్లాలను ఏర్పాటు చేయలేదు. కానీ బీడీల తయారీకి వినియోగించే తునికాకు సేకరణతో పల్లెజనం ఉపాధి పొందుతున్నారు. వాస్తవానికి తునికి చెట్లను జనవరి, ఫిబ్రవరి నెలలో కొమ్మకొట్టడం(ప్రూనింగ్) చేస్తే మళ్లీ చిగురించి నాణ్యమైన బీడీల ఆకు లభించేది. కానీ రెండు దశాబ్దాలుగా అటవీశాఖ తునికాకు సేకరణకు జిల్లాలో స్వస్తి పలికింది. దీంతో కొమ్మకొట్టే(ప్రూనింగ్) పనిని ఆపేశారు. తునికి చెట్లు బాగా ఉన్న అటవీ ప్రాంతాల్లో ఆకు ఇగురు వచ్చింది. దీంతో తునికాకు సేకరణ సాగుతుంది. ఈ తునికాకును స్థానికంగా బీడీ కంపెనీ టేకేదారులకు, బీడీకార్మికులకు నేరుగా అమ్ముకుంటారు. 50 ఆకుల తునికాకు కట్ట ధరను ప్రభుత్వం రూ.3 ధర నిర్ణయించగా.. అదే తునికాకు కట్టను రూ.5 నేరుగా అమ్ముకునే అవకాశం ఉంది. ఒక్కో మహిళ నిత్యం 100 నుంచి 200 కట్టల తునికాను సేకరిస్తారు. ఈ లెక్కన నిత్యం రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తారు.

**జిల్లా పల్లెల్లో తునికాకు ఉనికి**

జిల్లాలోని అటవీ గ్రామాల్లో తునికాకు చెట్లు ఉనికి ఉంది. కోనరావుపేట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి, చందుర్తి మండలాల్లోని అటవీ గ్రామాల్లో తునికాకు చెట్లు ఉన్నాయి. ఈ మండలాల్లోని అటవీ గ్రామాల్లో ఏటా తునికాకు సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఎండలో ఇతర పనులకు వెళ్లకుండా నీడపట్టున ఉండి ఉపాధి పొందే వీలుండడంతో తునికాకు సేకరణ చేస్తున్నారు. పల్లెల్లో ఉపాధిహామీ పనులు ఉన్నా మెరుగైన ఉపాధి వస్తుందని ఆకు సేకరణపై ఆసక్తి చూపుతున్నారు.

**గతంలో తునికాకు కల్లాలు**

గతంలో తునికాకు సేకరణను అటవీశాఖ చేపట్టింది. జిల్లాలో 25వేల స్టాండర్డ్ బ్యాగుల(ఎస్‌బీ) తునికాకు సేకరణ జరిగేది. పల్లెల్లో తునికాకు కల్లాలు పెట్టి మరీ సేకరించేవారు. ఒక్క కోనరావుపేట యూనిట్ పరిధిలోనే 5వేల ఎస్‌బీల తునికాకు లభించేది. ఒక్కో స్టాండర్డ్ బ్యాగులో వెయ్యి తునికాకు కట్టలు ఉండేవి. జిల్లాలో తునికాకు సేకరణకు అల్మాస్‌పూర్, గంభీరావుపేట, జిల్లెల్ల, మూడపల్లి, చందుర్తి, విలాసాగర్, కోనరావుపేట యూనిట్లు ఉండేవి. అప్పట్లో నక్సలైట్ల ప్రాబల్యంతో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అడవుల్లో ప్రతికూల పరిస్థితులు ఉండడంతో అధికారికంగా ఆకు సేకరణ నిలిచిపోయింది. కానీ పల్లెజనం మాత్రం ఉపాధిపై ఆశతో సేకరణ కొనసాగిస్తున్నారు. ఇంట్లో తునికాకు కట్టలు ఉంటే డబ్బులు నిల్వ ఉన్నట్లుగానే గ్రామీణులు భావిస్తున్నారు. ఇదే నమ్మకంతో ఆకు సేకరణ సాగిస్తున్నారు.

**ఆకు బాగా లేదు..**



అటవీ ప్రాంతాల్లో తునికాకు బాగా దొరకడం లేదు. చాలా దూరం తిరిగితే.. అక్కడో.. చెట్టు.. ఇక్కడో చెట్టు ఉంది. తునికాకు చెట్ల వెంట తిరిగి ఆకు సేకరిస్తున్నాం. ఇద్దరం కలిసి తిరిగితే ముల్లెడు తునికాకు లభించింది. ఎండ పూట ఇంట్లో కూర్చుని ఆకును మడతపెట్టి కట్టలు కడుతాం.

– భూక్య నందా, మానాల తండా

**బతుకుదెరువు కోసం..**



బతుకుదెరువు కోసం అడవుల్లో ఆకును సేకరిస్తున్నాం. ఇప్పుడేం పనులు లేవు. ఎండల్లో బయట పని దొరకదు. చెట్టుచెట్టుకు తిరిగితే.. ఆకు దొరుకుతుంది. నడిచిపోతే లేట్ అవుతుందని బండ్లమీద పోయి ఆకును సేకరిస్తున్నాం. కొమ్మకొడితే.. ఇంకా మంచి తునికాకు లభించేది.

– భానోత్ సుధాకర్, అడ్డబోరు తండా

**కాంట్రాక్టర్లు ఎవరూ రారు**



జిల్లాలో తునికాకు సేకరణకు కల్లాలు లేవు. తునికాకు కొనుగోళ్లకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రారు. స్థానికంగా బీడీ కార్మికుల అవసరాలకు ఆకు సేకరణ జరుగుతుంది. అడవుల్లో వన్యప్రాణుల సంచారం ఉంటుంది. జాగ్రత్తలు తీసుకోవాలి. అడవిలో వెళ్లకపోవడమే మంచిది.

– శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్వో, సిరిసిల్ల

# నామినేషన్ల జోరు



కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

- కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి 13 నామినేషన్లు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ నామినేషన్ వేయగా భాజపా అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తరపున ఆ పార్టీ నేతలు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి నామినేషన్ అందజేశారు. ఈనెల 25తో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా సోమవారం మంచిరోజుగా భావించిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఒక్కరోజే 13 నామినేషన్లు దాఖలు కాగా ఎన్నికల అధికారి పమేలా సత్పతి స్వీకరించారు.

**కలెక్టరేట్‌లో కోలాహలం**

శనివారం నామినేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగగా సోమవారం ఒక్కరోజే 13 దాఖలయ్యాయి. దీంతో కలెక్టరేట్ ప్రాంతం రాజకీయ వాతావరణాన్ని మరిపించింది. కాంగ్రెస్ అభ్యర్థిగా రాజేందర్‌రావు నాలుగుసెట్ల నామినేషన్ పత్రాలను వేర్వేరుగా అందజేశారు. కాగా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చింత అనిల్ కుమార్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా తాళ్లపల్లి అరుణ, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గట్టు రాణా ప్రతాప్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా చిలువేరు శ్రీకాంత్, ఎంసీపీఐ అభ్యర్థిగా లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా దేవునూరి శ్రీనివాస్, బంక రాజు, అబ్బడి బుచ్చిరెడ్డి, గవ్వల లక్ష్మి, జింక శ్రీనివాస్, బరిగె గట్టయ్యయాదవ్, ఎండీ జిషాన్ నామినేషన్లు అందజేశారు. ఇప్పటికే ఆరు నామినేషన్లు దాఖలు కాగా మొత్తం 19 నామినేషన్లు అందాయని ఎన్నికల యంత్రాంగం పేర్కొంది.

**వెలిశాల రాజేందర్‌రావు ఆస్తి రూ.26.58కోట్లు**

కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్నా వెలిశాల రాజేందర్‌రావు తన కుటుంబసభ్యుల మీద రూ.26.58 కోట్లు ఆస్తులు ఉన్నట్లు తన అఫిడివిట్‌లో పేర్కొన్నారు. అందులో చరాస్తులు తన పేరు మీద రూ.4.59కోట్లు, తన భార్యకు 3.66కోట్లు ఉన్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో తన కుటుంబ సభ్యుల మీద రూ.18.33కోట్ల విలువైన వ్యవసాయ, కమర్షియల్ స్థలాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం తన చేతిలో రూ.2.14లక్షలు, తన భార్య వద్ద రూ.51,500 ఉన్నాయన్నారు. తన దగ్గర 9తులాల బంగారం, తన భార్య దగ్గర 105 తులాల బంగారం ఉందని అఫిడివిట్‌లో పేర్కొన్నారు.

# వాన.. హైరానా

- జిల్లాలో చిరుజల్లులు
- ఆగమైన రైతులు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం చిరుజల్లులు పడ్డాయి. చందుర్తిలో 5 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్‌లో 0.6 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంటలో 0.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో వాతావారణ పొడిగానే ఉంది. వేసవికాలంలో అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరి కోతలు, ధాన్యం కొనుగోళ్లు సాగుతుండగా.. అకాల వర్షాలతో అయోమయం నెలకొంది.

**దంచికొట్టిన వర్షం**

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం రాత్రి అకాల వర్షం రైతలను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫలితంగా మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో రాత్రి అంధకారం నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లోని నిల్వ చేసిన ధాన్యం తడిసింది. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు కేంద్రాల్లో టార్పాలిన్లు ఇవ్వాలని కోరారు.

# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా రైతులు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మరో మూడు రోజులలో అకాల వర్షాలు ఉన్నందునా అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ధాన్యం తడవకుండ జాగ్రత్తలు సూచించారు. గోనెసంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు.

**కొనుగోళ్లు ప్రారంభించాం**

జిల్లాలో గతేడాది ఏప్రిల్ 25న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని, ఈసారి ఇప్పటికే 5,379 రైతుల నుంచి రూ.82.13కోట్ల విలువైన 37,280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని, రూ.17.37కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. జిల్లాలో మొత్తం 33,986 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు రవాణా చేసినట్లు చెప్పారు. ధాన్యం తరలింపులో తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్, జిల్లా సహకార అధికారి, డీఆర్‌డీఏ, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ ఉన్నారు.

# ఆర్భాటపు ప్రచారాలు వద్దు

- ఇంటింటికెళ్లి చర్చించండి
- బీఆర్ఎస్ పార్టీని గెలిపించండి
- 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో
- సమష్టిగా కృషి చేస్తే కరీంనగర్ పార్లమెంట్ మనదే..
- సిరిసిల్ల పట్టణ క్లస్టర్‌స్థాయి కార్యకర్తలతో కేటీఆర్



తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్భాటపు ప్రచారాలు వద్దని, కాంగ్రెస్, బీజేపీ మోసాలపై ఇంటింటికెళ్లి చర్చించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు కోరారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో సోమవారం సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ శ్రేణులతో సుదీర్ఘంగా సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించేందుకు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని మీరు గెలిపిస్తే.. మున్సిపల్ ఎన్నికల్లో మీ అందరినీ గెలిపించే బాధ్యత నాదంటూ.. కేటీఆర్ భరోసా నిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై వంద రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఐదేళ్లు ఎంపీగా బండి సంజయ్ సిరిసిల్లకు చేసిందేమీ లేదన్నారు. తెలంగాణకు ఏమి చేయని బీజేపీకి, నయాపైసా పనిచేయని బండి సంజయ్‌కు ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చించాలని కేటీఆర్ కోరారు.

**సిరిసిల్లలో 10న కేసీఆర్ రోడ్ షో**

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని కేటీఆర్ వివరించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్లలో మే 10న కేసీఆర్ రోడ్ షో ఉంటుందని, ప్రతీ కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమష్టిగా పనిచేస్తే కరీంనగర్ పార్లమెంట్‌స్థానం బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ 20 రోజులు ఇతర పనులు పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు.

**క్లస్టర్ల వారీగా సమావేశాలు**

సిరిసిల్ల పట్టణంలోని ప్రతీ నాలుగు వార్డులకు ఒక్క క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ప్రతీ క్లస్టర్ పరిధిలో 50 నుంచి 60 మందితో కేటీఆర్ విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు, పార్టీ వార్డు కమిటీ అధ్యక్షులు, కమిటీ ప్రతినిధులతో చర్చించారు. ప్రతీ క్లస్టర్ ప్రతినిధులను పేరు పేరునా పలకరిస్తూ దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పార్టీ నాయకులు బొల్లి రామ్మోహన్, ఒజ్జల అగ్గిరాములు తదితరులు పాల్గొన్నారు.

**సెల్‌ఫోన్ వెలుగుల్లో సమీక్షలు**

గాలివానలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తెలంగాణ భవన్‌లో అంధకారం అలుముకుంది. సెల్‌ఫోన్ వెలుగుల్లో కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడారు. రాత్రి 9 గంటల వరకు పార్టీ శ్రేణులతో చర్చించారు.

**నూతన వధూవరులకు ఆశీర్వాదం**

బీఆర్ఎస్ నాయకుడు అన్నల్‌దాస్ వేణు పెళ్లి ఆదివారం జరగ్గా.. సిరిసిల్లలోని వారింటికి వెళ్లి నూతన వధూవరులను కేటీఆర్ ఆశీర్వదించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాల విరమణ మండపం వద్ద స్వాములు



జై శ్రీరాం జై హనుమాన్ నినాదాలతో స్వాములు

# జైబోలో హనుమాన్‌కీ..

- హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం
- భక్తులతో పులకించిన కొండగట్టు పుణ్యక్షేత్రం
- అంజన్న నామస్మరణతో మార్మోగిన ఆలయం

కొండగట్టు(చొప్పదండి): 'రామలక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్‌కీ..' అంటూ కొండగట్టులోని అంజన్న ఆలయం పులకించిపోయింది. చైత్ర పౌర్ణమి సందర్భంగా హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభించారు. హనుమాన్ దీక్షాపరులు మాల విరమణకు వేల సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం స్వామివారి జయంతి కావడంతో సుమారు 1.50లక్షల మంది భక్తులు వస్తారని ఆలయ అధికారులు తెలిపారు. వారికి సరిపడా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఈవో చంద్రశేఖర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు భక్తుల ఏర్పాట్లలో మునిగిపోయారు. కొండపైకి వచ్చిన భక్తులు ముందుగా క్యూలైన్ ద్వారా స్వామి వారిని దర్శించుకోవాలని, ఇరుముడులను ఆలయంలో ఏర్పాటు చేసిన జాలీల్లో సమర్పించాలని, పాత కోనేరు ఎదురుగా ఉన్న మెట్ల నుంచి కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన లైన్ల ద్వారా మండపంలోకి వెళ్లి మాల విరమణ చేసుకోవాలని, శ్రీరామకోటి స్తూపం వద్దగల షెడ్డులో తలనీలాలు సమర్పించాలని, కోనేరులో పుణ్యస్నానం ఆచరించి.. చివరగా ప్రసాదం తీసుకుని తిరుగు ప్రయాణం కావాలని ఆలయ అధికారులు తెలిపారు.

# రూ.3లక్షలు పట్టివేత

చందుర్తి(వేములవాడ): మండలంలో సోమవారం బైక్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3లక్షలను పట్టుకున్నట్లు చందుర్తి పోలీసులు తెలిపారు. వేములవాడకు చెందిన రేగుల రజనీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా బైక్‌పై తరలిస్తుండగా చందుర్తి బస్టాండ్ ప్రాంతంలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీ చేసి పట్టుకున్నారు. నగదును సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

**ఎక్కడికక్కడ తనిఖీలు**

వేములవాడరూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. వేములవాడ నుంచి కోరుట్లకు వెళ్లే ప్రధాన రోడ్డు కోనాయపల్లి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఏఈఈ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. కానిస్టేబుల్ నాగరాజు, సంతోష్, భిక్షపతి పాల్గొన్నారు.



రూ.3లక్షలు పట్టుకున్న చందుర్తి పోలీసులు

## క్లుప్తంగా

### డీజే నిర్వాహకుల బైండోవర్



చందుర్తి(వేములవాడ): మండలంలోని పలు గ్రామాలకు చెందిన డీజే నిర్వాహకులను తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లోని డీజే నిర్వాహకులు దర్శనాల సంతోష్, పొలాస ప్రమోద్, కైరశశి, పులి ప్రశాంత్, అజయ్, నేవూరి సందీప్, ఎండీ ఇబ్రహీంలను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు.

### యువతి అదృశ్యం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన యువతి బండారి సుజాత (27) ఆదివారం తెల్లవారుజామున అదృశ్యమైంది. సుజాత తండ్రి బాబు ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. సుజాత కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి ఇంట్లోనే నిద్రపోయింది. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. కూతురు కోసం చుట్టు పక్కల ఇళ్ల, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### స్కూల్‌లో చోరీకి యత్నం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి యత్నించి విఫలమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. పాఠశాల ఆఫీస్ గదిలో టీవీ, ఇతర పరికరాలు ఉండడంతో చోరీకి యత్నించారని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా వారు విచారణ చేపట్టారు. గతంలోనూ చోరీకి యత్నించారని గ్రామస్తులు తెలి పారు. రాత్రి పూట పాఠశాల ప్రాంగణంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారని చెప్పారు. పోలీసులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

### గొంతు కోసుకుని మహిళా ఆత్మహత్యాయత్నం



గొంతు కోసుకున్న సుజాత

వీర్నపల్లి(సిరిసిల్ల): అనారోగ్యాన్ని భరించలేక ఓ మహిళ గొంతు కోసుకున్న సంఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పొట్ల సుజాత(38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సోమవారం మధ్యాహ్నం తీవ్ర మనస్తాపానికి గురై గొంతు కోసుకొంది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

### నేటినుంచి ఉచిత యోగా శిక్షణ

సిరిసిల్లటౌన్: ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు యోగా గురువులు యాద రమేశ్, బిల్ల శ్రీకాంత్, పోలుక ఆనంద్, గోలి ఆరజు, నవీన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు మూడునుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఉచిత యోగా శిక్షణలో చేర్పించాలని కోరారు.

### యువకుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన కోట శ్రీనయ్య(26) అర్బన్ మండలంలోని అంబారిపేటలో గేదెల కాపరిగా పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం అతనికి రజిత అనే యువతితో వివాహమైంది. కాగా, కొంతకాలంగా శ్రీనయ్యకు మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం అంబారిపేటలోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### రూ.15 లక్షలు పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్): వాహన తనిఖీల్లో సోమవారం భారీగా నగదు పట్టుకున్నట్లు హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గ్రేన్ మార్కెట్ ఏరియా రోడ్డులో టౌన్ సీఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో జమ్మికుంట పట్టణంలోని మోత్కుల గూడెంకు చెందిన పొనగంటి సురేశ్ తన బైక్‌లో రూ.15 లక్షలు తరలిస్తూ పట్టుబడ్డాడు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా ఎన్నికలు, ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

# రెబల్ రెడ్డీ!

- 25న నామినేషన్ వేసేందుకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే
- అలిగిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం పిలుపు
- త్యాగానికి విలువలేకుండా పోయిందని ఆవేదన
- కాంగ్రెస్ బలగంతో వెలిచాల నామినేషన్
- పోటాపోటీ నామినేషన్లతో పార్టీలో పెరగనున్న వేడి



సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా వీడలేదు. పార్టీ సూచనల మేరకు సోమవారం ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేయగా, తనకు రావాల్సిన టికెట్ మరొకరికి ఎలా ఇస్తారంటూ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కూడా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో హస్తం పార్టీలో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారన్న సమాచారం ఒక్కసారిగా వేడి పెంచింది. పార్టీ ఇంతవరకూ ఎవరికీ బీఫారం ఇవ్వకపోవడంతో ప్రవీణ్‌రెడ్డి వర్గంలో ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. తమ నేతకు టికెట్ ఇప్పించేందుకు చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే రెబల్‌గా బరిలో దిగాలన్న యోచనలో ప్రవీణ్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

**హడావుడి సోమవారం**

సోమవారం కరీంనగర్‌లో పలు ఆసక్తికర పరిణామాలు జరిగాయి. ఇప్పటికే తానే అభ్యర్థినంటూ ప్రచారం మొదలుపెట్టిన వెలిచాల రాజేందర్‌రావు మధ్యాహ్నం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్‌లతో కలిసి నామినేషన్ వేశారు. మరోవైపు వెంటనే బయల్దేరి హైదరాబాద్ రావాలిందిగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి గాంధీ భవన్ నుంచి పిలుపువచ్చింది. బయల్దేరిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం, పార్టీ పెద్దల నుంచి ఎలాంటి హామీ దక్కలేదని తెలిసింది. ఈ విషయం తెలిసి ప్రవీణ్‌రెడ్డి వర్గం అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూరు, కరీంనగర్ నియోజకవర్గాల్లో తమ నేత కుటుంబానికి అభిమానులు వేలాదిగా ఉన్నారని, తమను కాదని ఇతరులకు ఎలా టికెట్ ఇస్తారని మండిపడుతున్నారు.

**బరిలో అలిగిరెడ్డి**

పార్టీ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం ప్రవీణ్‌రెడ్డిని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. పార్టీ పెద్దలు చెప్పిన మాట విని, తాను ఎమ్మెల్యే సీటును త్యాగం చేస్తే, తీరా తనకే ఎంపీ సీటు ఇవ్వకుండా పారాచ్యూట్ లీడర్లకు ఇవ్వడంపై ఆయన వర్గీయులు భగ్గుమంటున్నారు. ఇదే సమయంలో పార్టీపై ఆయన వర్గీయులు మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ఇదే సమయంలో అలిగిరెడ్డితో బుధవారం నామినేషన్ వేయించాలని వ్యూహం రూపొందిస్తున్నారు. 25వ తేదీన నామినేషన్ వేయించాలని, ఆ తరువాత అధిష్టానం పెద్దలు చర్చలకు పిలుస్తారని, అప్పుడు బరిలో ఎవరి నిలుస్తారు? ఏ కారణం చేత టికెట్ కన్‌ఫర్మ్ చేస్తున్నారు? ఎవరికి చేస్తున్నారు? తప్పుకున్న వారి భవిష్యత్తు ఏంటి? అన్న విషయాలపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. స్పష్టమైన హామీ రాని పక్షంలో బరిలో రెబెల్‌గా నిలబడాలని ఆయన వర్గీయులు ప్రవీణ్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు.



బైపాస్‌రోడ్‌పై ధాన్యం కుప్పలు వేసి.. అడ్డుగా పెట్టిన స్టాపర్‌లు



### రహదారులే కల్లాలు !



పెద్దూరు, వెంకటాపూర్ గ్రామాల్లో రహదారులే ధాన్యం కల్లాలుగా మారిపోయాయి. వెంకటాపూర్ నుంచి చంద్రంపేట వరకు గల రెండో బైపాస్‌రోడ్డు ఒక వైపు మొత్తాన్ని రైతులే ఆక్రమించేశారు. రోడ్డును ఆనుకుని ఉన్న రైతుల తమ పొలంలో కోసిన పంటను బైపాస్‌రోడ్డుపైనే ఆరబోస్తున్నారు. తేమ శాతం రాగానే విక్రయించేస్తున్నారు. ఇలా గత 20 రోజులుగా బైపాస్‌రోడ్డు ధాన్యం కల్లంగా మారింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



పొత్తూరులో బండ్ల ర్యాలీ



మామిడిపల్లిలో..

### ఉత్సాహంగా శకటోత్సవం

తంగళ్లపల్లి(సిరిసిల్ల)/కోనరావుపేట(వేములవాడ): ఇల్లంతకుంట మండలం పొత్తూరులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శకటోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు ఉత్సాహంగా తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీటీసీ పట్నం అశ్విని, తాజామాజీ సర్పంచులు సిద్ధం శ్రీనివాస్, పర్శరాములుగౌడ్, నాయకులు కదురు శేఖర్ పాల్గొన్నారు.

# ఇటు టీచర్.. అటు ట్రైనర్



ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న మహేందర్‌రెడ్డి



పిల్లలకు పాఠాలు చెబుతూ..



ఉత్తమ టీచర్ అవార్డు అందుకుంటూ..

- పిల్లలకు విద్యాబోధన
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ
- పాతికేళ్లుగా మాస్టర్ ట్రైనర్‌గా గుర్తింపు
- వరించిన అవార్డులెన్నో..
- ఆదర్శం.. పాతూరి మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధులను కత్తిమీద సాములా భావిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి, పొరపాట్లకు తావులేకుండా పని చేయడం ఓ సవాల్. అంతటి ఒత్తిడి ఉండే ఎన్నికల విధులు, నిబంధనలపై అధికారులు, సిబ్బందికి శిక్షణనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి మహేందర్‌రెడ్డి. టీచర్‌గా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ నే ఎన్నికల సమయంలో ట్రైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాతికేళ్లుగా మాస్టర్ ట్రైనర్‌గా గుర్తింపు పొందారు.

**కల్లోల కోటలో పాఠాలు బోధన..**

1996 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన మహేందర్‌రెడ్డి తొలి పోస్టింగ్ కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌లో పొందారు. ఈ కల్లోల పల్లె సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి నక్సలైట్లకు పెట్టని కోట. అక్కడికి వెళ్లాలంటేనే భయంతో వణికిపోయే రోజుల్లో టీచర్‌గా ఆ గ్రామ పిల్లలకు పాఠాలు బోధించారు. ప్రస్తుతం సిరిసిల్లలోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

**ఉత్తమ రిసోర్స్ పర్సన్..**

కోనరావుపేట మండల రిసోర్స్ పర్సన్‌గా ఎంపికైన మహేందర్‌రెడ్డి డీపీఈపీ ప్రాజెక్టులో మండల స్థాయిలో పనిచేస్తూ అక్షరాస్యత, పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారు. బడి లేని శివారు పల్లెల్లో పిల్లల సంఖ్యను గుర్తించి, కొత్త బడికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ఉత్తమ రిసోర్స్ పర్సన్‌గా అవార్డు అందుకున్నారు. అనంతరం మర్తనపేట, మండేపల్లి పాఠశాలల్లో పనిచేస్తూ 2006లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, ఉన్నత పాఠశాల ఆవునూరు, అంబేడ్కర్‌నగర్‌లో పని చేశారు.

**చదివిన బడిలోనే ఉపాధ్యాయుడిగా..**

పుట్టి పెరిగిన ఊరు, చదువుకున్న బడిలోనే ఉపాధ్యాయుడిగా పనిచేసే అవకాశం ఆయనకు లభించింది. స్కూల్లో శుద్ధజల కేంద్రం, నిజాయతీ దుకాణం, ఇంకుడుగుంతలు, మానవత్వపు గోడ, కిచెన్ గార్డెన్, వనవిజ్ఞానం, బాలసభ, సేంద్రియ ఎరువులు, వాటర్ ఆడిట్, పెన్‌బ్యాంక్ ఏర్పాటు, సరస్వతి విగ్రహం, టై, బెల్టుల పంపిణీ, వెండి పతకాలు అందించడం వంటి వినూత్న కార్యక్రమాలతో భీముని మల్లారెడ్డిపేట బడిలో పాఠాలు బోధించారు.

**నిత్య విద్యార్థిగా ఆన్‌లైన్ కోర్సులు..**

మహేందర్‌రెడ్డి ఉపాధ్యాయుడిగానే కాకుండా.. నిత్య విద్యార్థిగా ఆన్‌లైన్ కోర్సులను పూర్తి చేశారు. కరోనా సమయంలో ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్‌ఐఈపీఏ, నిషిత, ఎన్‌సీఎస్‌ఎల్, స్వయం, కోరిసిరా, దీక్షా, ఎస్‌సీఈఆర్‌టీ, జాన్ హోప్కిన్స్ అమెరికన్ యూనివర్సిటీ తదితర ఆన్‌లైన్ కోర్సులు 120 రోజుల్లో 400 పూర్తి చేసి, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదుతోపాటు గోల్డ్ మెడల్ సంపాదించారు. గ్లోబల్ టీచర్ అవార్డు–2020 అందుకున్నారు. విశ్వగురు అవార్డు సొంతం చేసుకున్నారు. ఉపాధ్యాయుడిగా రాష్ట్రస్థాయి పురస్కారం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ట్యూటర్స్ ప్రైడ్ ఐడియల్ టీచర్, అబ్దుల్ కలాం, నేషనల్ ఇంటిగ్రేటెడ్, రాష్ట్ర గురుబ్రహ్మ, విద్యాభూషణ్ జాతీయ, సేవారత్న రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. సావిత్రిబాయి విశిష్ట సేవా, కరోనా వారియర్ రాష్ట్రస్థాయి పురస్కారాలు, గ్లోబల్ టీచర్, విశ్వగురు ఇంటర్నేషనల్, ప్రైడ్ ఆఫ్ ఇండియా నంది, విద్యారత్న జాతీయ అవార్డులు అందుకున్నారు.

# పాత గొడవలతో కుటుంబంపై దాడి

- వాహనాలు ధ్వంసం
- ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న కనకయ్య



ధ్వంసమైన ఇంటి సామగ్రి

కోనరావుపేట(వేములవాడ): పాత గొడవలను మనసులో పెట్టుకొని, ఓ కుటుంబంపై దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్‌ల కుటుంబానికి గొడవలున్నాయి. 15 రోజుల క్రితం బాబు తమ ఇంట్లోకి వచ్చి, రూ.50 వేలు ఎత్తుకెళ్లాడని, పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని ఎల్లవ్వ, ప్రశాంత్ కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బాబు, అతని తండ్రి కనకయ్య, భార్య శిరీష ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీశ్, ప్రశాంత్, దేవయ్య, ఇతర కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో వచ్చి దాడి చేశారు. ఇంటి ఎదుట ఉన్న కారు, ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఆ ముగ్గురికీ గాయాలయ్యా యి. బాబు ప్రాణభయంతో త న కు టుంబసభ్యులతో కలిసి పరుగులు పె ట్టాడు. మల్కపేటలోని స్నేహితుడి సా యంతో సిరిసిల్లలోని ఆస్పత్రికి వెళ్లా డు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆంజనేయులు ఆస్పత్రికి వెళ్లి, వివరాలు సేకరించారు. బాబు ఫిర్యాదు మేరకు స తీశ్, ప్రశాంత్, దేవయ్యలతోపాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అడుగంటిపోతున్న జలవనరులు



ముస్తఫానగర్‌లోని మసీదు చెరువు



సర్మాల ఎగువమానేరు జలాశయం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండుతున్న ఎండలకు నీటివనరులు ఎండిపోతున్నాయి. గంభీరావుపేట మండలంలోని ఎగువమానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు పడిపోతున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులు కాగా.. ఆదివారం నాటికి 17 అడుగులకు చేరింది. మండల కేంద్రంలోని వెంకటాద్రి, నమాజ్ చెరువులు, ముస్తఫానగర్‌లోని మసీదు చెరువులు ఎండిపోయాయి. చెరువులు ఎండుతుండడంతో సమీపంలోని బోరుబావులు ఎత్తిపోతున్నాయి.



గంభీరావుపేటలోని వెంకటాద్రి చెరువు

## తల్లిదండ్రులతో గొడవపడి, పారిపోయి..

రామగుండం: ఇంట్లో గొడవపడిన ఓ బాలిక పారిపోయింది. రామగుండం రైల్వే ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) సిబ్బంది గుర్తించినట్లు సీఐ సురేశ్ గౌడ్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన పన్నెండేళ్ల విజయలక్ష్మి తండ్రి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటున్నాడు. సోమవారం కుటుంబసభ్యులతో గొడవపడిన బాలిక ఇంటి నుంచి పారిపోయి, రామగుండం చేరుకుంది. స్థానిక రైల్వేప్లాట్‌ఫాంపై తిరుగుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది ఆరా తీశారు. కుటుంబసభ్యులకు తెలియకుండా పారిపోయి వచ్చినట్లు తెలిపింది. దీంతో వారు చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ సతీశ్‌ను పిలిపించారు. తర్వాత బాలిక కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, వారు రాగానే అప్పగించారు. కాగా, బాలికను గుర్తించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ లోకేంద్రకాన్‌ను సీఐ అభినందించారు.

# అందని ఫిజియోథెరపీ

- మూడు నెలలుగా మూలనపడ్డ పరికరాలు
- జిల్లాలో 9 పీహెచ్‌సీల్లో నిలిచిన సేవలు
- స్టాఫ్‌నర్స్‌ల బదిలీలతో ఆగిన ఫిజియోసేవలు
- నెరవేరని కలెక్టర్ అనురాగ్‌జయంతి లక్ష్యం



తెరుచుకోని ఫిజియోథెరపీ కేంద్రం

ముస్తాబాద్(సిరిసిల్ల): మారుమూల పల్లెల్లో పేదలకు ఫిజియోథెరపీ సేవలు అందించాలన్న కలెక్టర్ ఉన్నత ఆశయం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. ఏడాది క్రితం జిల్లాలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పక్షవాతం, నొప్పులు, దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఫిజియోథెరపీ కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పుడు ఆ ఫిజియోథెరపీ కేంద్రాలు పనిచేయడం లేదు. ఆరు నెలలపాటు వేలాది మంది రోగులకు సేవలందాయి. నాలుగు నెలల క్రితమే స్టాఫ్‌నర్స్‌లకు రెగ్యులర్ పోస్టులు రావడంతో ఫిజియోథెరపీ సేవలు నిలిచిపోయాయి.

**కలెక్టర్‌ను కదిలించిన ఘటనలు**

ఏడాది క్రితం కలెక్టర్ అనురాగ్‌జయంతి గ్రామాల్లో పక్షవాతం, దివ్యాంగులు, ఇతర రోగులు పడుతున్న దుస్థితిని చూసి చలించిపోయారు. వారికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తే మామూలు మనుషులు అవుతారని గ్రహించి.. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలను రూ.12.78 లక్షలతో ప్రారంభించారు. స్టాఫ్‌నర్స్‌లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఆరు నెలలుగా వందలాది మంది రోగులకు ఇక్కడ సేవలందించారు. వైద్యాధికారుల పర్యవేక్షణ కరువవడంతో రోగులకు శాపంగా మారింది.

**జిల్లాలో ఫిజియోథెరపీ కేంద్రాలివే..**

జిల్లాలోని 9 పీహెచ్‌సీల్లో ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముస్తాబాద్ మండలం పోతుగల్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ఇల్లంతకుంట, వేములవాడ, చందుర్తి, తంగళ్లపల్లి, కోనరావుపేట, కొదురుపాక, వేములవాడల్లో ఫిజియోథెరపీ కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం కొన్ని కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. కొన్ని కేంద్రాల్లో రోగులకు సేవలు అందించకున్న వారి పేర్లు, ఫోన్ నంబర్లు నమోదు చేయడం గమనార్హం.



మూలనపడ్డ థెరపీ పనిముట్లు

**ఒక్క రోజు శిక్షణతో కొత్త స్టాఫ్**

పదోన్నతులు, రెగ్యులర్ ఉద్యోగాలు సాధించిన స్టాఫ్‌నర్స్‌లతో దూరమైన ఫిజియోథెరపీ సేవలను తిరిగి గాడిలో పెట్టేందుకు అధికారులు చేపడుతున్న చర్యలు సరిగ్గా లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన స్టాఫ్‌నర్స్‌లకు నెల రోజుల క్రితమే ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కేవలం ఒక్కరోజు శిక్షణతో ఏం తెలుసుకుంటారో అధికారులకే తెలియాలని పలువురు చర్చించుకుంటున్నారు. నెల రోజుల క్రితం శిక్షణ పొందిన స్టాఫ్‌నర్సులలో కొందరు ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఫిజియోథెరపీ చేసిన దాఖలాలు లేవు. కనీసం రిజిష్టర్ కూడా నిర్వహించకపోగా, దుమ్ముపట్టి, పనికిరాకుండా పోయాయి.

### ఫిజియో సేవలు అందించలేదు



నేను పక్షవాతంతో బాధపడుతున్నాను. పోతుగల్‌లో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారనే విషయం కూడా తెలియదు. నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని తెలిసింది. చాలా మంది వేల రూపాయలు పెట్టి సిద్దిపేటలో ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు.
– విజయ, ముస్తాబాద్

### సేవలు అందిస్తాం



స్టాఫ్‌నర్స్‌ల బదిలీలతో కొంత గ్యాప్ వచ్చింది. కొత్తవారికి శిక్షణ ఇచ్చాం. రెగ్యులర్‌గా పీహెచ్‌సీలలో ఫిజియోథెరపీ సేవలు అందుతాయి. ఎక్కడ నిర్లక్ష్యం లేకుండా ప్రతి రోజు గ్రామీణ రోగులకు సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి